# నమస్తే తెలంగాణ
# మెదక్
I హైదరాబాద్, ఆదివారం 23 ఫిబ్రవరి 2025 MEDAK


## నీళ్లివ్వకుంటే రైతులు ఊరుకోరు

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



చేర్యాల, ఫిబ్రవరి 22: అమాయక రైతుల మధ్య స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి చిచ్చుపెడుతున్నారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శనివారం ప్రకటనలో విమర్శించారు. దేవాదుల ప్రాజెక్టు లిఫ్ట్ ఇరిగేషన్‌లో భాగంగా ధర్మసాగర్ నుంచి గండిరామారం రిజర్వాయర్‌కు లిఫ్ట్ చేయాల్సిన మోటర్లను 15 రోజులుగా బంద్ చేస్తే అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకోలేదన్నారు. జనగామ నియోజకవర్గంలోని రిజర్వాయర్లు నింపి తద్వారా చెరువులకు నీటిని విడుదల చేసి రైతుల పంటలు కాపాడుకోవాలని తానే స్వయంగా ఈఎన్‌సీ అనిల్‌కుమార్, ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్‌బొజ్జ, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పలుసార్లు దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. సిబ్బంది సమ్మె చేస్తున్నారని, వారి బకాయిలు ఇస్తే వారు పని చేస్తారని తెలియజేసి సమస్య పరిష్కరించినట్లు తెలిపారు. ఓఅండ్ఎం సిబ్బంది సమ్మె చేసి మోటర్లను బంద్ చేస్తే పట్టించుకొని అధికార పార్టీ నాయకులు, వారు సమ్మె విరమించి మోటర్లు ఆన్ చేయగానే తగుదనమ్మా అని గండిరామారం రిజర్వాయర్ వద్దకు వచ్చి రైతుల మధ్య చిచ్చుపెట్టి డ్రామాలు ఆడడం తగదని విమర్శించారు. ధర్మసాగర్ నుంచి గండిరామారం, బొమ్మకూరు, కన్నెబోయిన గూడెం, వెల్దండ, లద్నూరు, తపాస్‌పల్లి రిజర్వాయర్లకు జలాలు రావాల్సి ఉందన్నారు. జనగామ నియోజకవర్గంలోని 80శాతం ఆయకట్టుకు ఈ రిజర్వాయర్ల ద్వారా నీరు అందాల్సి ఉందని, ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటడంతో నీళ్లులేక రైతులు ఎండిన పొలాలను పశువుల మేతకు వదిలిపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే నీటిని విడుదల చేయకపోతే రైతుల ఆగ్రహానికి చవిచూడాల్సి వస్తుందని ఎమ్మెల్యే పల్లారాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.

## దుకాణాదారుడికి నోటీసులిచ్చాం: ఏవో

కౌడిపల్లి, ఫిబ్రవరి 22: అధిక ధరలకు ఎరువులు అమ్మినందుకు భాగ్యలక్ష్మి ఫర్టిలైజర్ షాపు యజమానికి నోటీసులు ఇచ్చామని మండల వ్యవసాయ అధికారి స్వప్న తెలిపారు. శనివారం 'జిల్లా అధికారుల ఆదేశాలు బేఖాతర్.. అధిక ధరలకు యూరియా విక్రయాలు' అంటూ 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని పలు దుకాణాల్లో తనిఖీలు చేశారు. భాగ్యలక్ష్మి ట్రేడర్‌లో తనిఖీలు చేసి అధిక ధరలకు విక్రయించినందుకు యజమానికి ఇక నుంచి ఎరువులు అమ్మొద్దంటూ నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనుమతి లేకుండా అమ్మకాలు జరిపితే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్



ఫర్టిలైజర్ దుకాణాదారుడికి నోటీసులు ఇస్తున్న మండల వ్యవసాయ అధికారి స్వప్న

# అన్నదాతకు వరిగోస

## నీళ్లులేక ఎండుతున్న పంటలు.. అడుగంటిన భూగర్భ జలాలు

- గోదావరి జలాల పంపింగ్ మరిచిన ప్రభుత్వం
- బోసిపోయిన 120 చెరువులు
- 46 వేల ఎకరాల్లో ప్రశ్నార్థకంగా వరిపంట
- నిత్యం పదుల సంఖ్యలో బోరుబావుల తవ్వకం
- తీవ్ర ఆందోళనలో సిద్దిపేట జిల్లా చేర్యాల ప్రాంత రైతులు



ఎండిపోతున్న వరి పంట



తపాస్‌పల్లి రిజర్వాయర్ వద్ద నిలిచిపోయిన నీటి పంపింగ్

చేర్యాల, ఫిబ్రవరి 22: బీఆర్ఎస్ హయాంలో పచ్చగా మారిన చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలు కాంగ్రెస్ పాలనలో మళ్లీ కరువు బారినపడుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో యాసంగి పంటలు పండిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో ఏటా మద్దూరు మండలంలోని లద్నూరు, కొమురవెల్లి మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్లను మత్తడి లెవల్ వరకు గోదావరి జలాలతో నింపేవారు. అనంతరం అక్కడ నుంచి కాల్వల ద్వారా గ్రామాల్లోని చెరువులకు నీటిని నింపి పొలాలకు అందించేవారు. దీంతో పంటలు పండాయి. కరువు చాయలు లేకుండే. ప్రస్తుతం పంటలను కాపాడేందుకు కాంగ్రెస్ సర్కారు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రైతులకు నష్టాలు తప్పేలా లేవు. పూర్తిగా రుణమాఫీ కాకపోవడం, రైతుభరోసా అందక పోవడంతో ఇప్పటికే రైతులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఇప్పుడు నీళ్లులేక యాసంగి పంటలు ఎండిపోతుండడంతో పెట్టిన పెట్టుబడులు మీద పడేలా ఉన్నాయి. బోరుబావులు ఎండిపోవడంతో కొత్తగా బోర్లు వేస్తూ రైతులు మరింత అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కొద్దికొద్దిగా నీరు పోస్తున్న బోరుబావుల వద్ద పడిగాపులు కాస్తూ తమ పంటలను దక్కించుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఎవుసానికి నాణ్యమైన కరెంటు సరఫరా కాకపోవడంతో తరచూ కరెంట్ మోటర్లు కాలిపోతున్నాయి. ఈ యాసంగిలో చేర్యాల ప్రాంతంలో 120 చెరువుల కింద సుమారు 46వేల ఎకరాల్లో రైతులు వరిపంట వేశారు.

### రిజర్వాయర్లకు నీటిని విడుదల చేయని ప్రభుత్వం...

ఉమ్మడి చేర్యాల మండలంలో తపాస్‌పల్లి, ఐనాపూర్ గ్రామాల మధ్య తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను జె.చొక్కరావు దేవాదుల ఎత్తిపోతల పథకం రెండో దశలో 0.3 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. రిజర్వాయర్ ద్వారా 67ఎకరాల ప్రతిపాదిత ఆయకట్టుగా నాటి సర్కారు నిర్ణయించింది. చెరువులు నింపి రైతులకు నీటిని అందించేందుకు 14.175 కిలోమీటర్ల కుడి కాల్వ ద్వారా 48 వేలు, మిగిలిన 19వేల ఎకరాలను ఎడమ కాల్వలను నిర్మించారు. చేర్యాల, కొమురవెల్లి, ఉమ్మడి మద్దూరు మండలంతో పాటు జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని కొన్ని గ్రామాలు, సిద్దిపేట జిల్లాలోని కొండపాక మండలంలోని కొన్ని గ్రామాల చెరువులకు నీటిని ఏటా విడుదల చేయడంతో భూగర్భజలాలు పెరిగి బోరు బావుల నుంచి పుష్కలంగా నీరు వచ్చి పంటలు పండాయి. ఫేజ్-2లో పైపులైన్ల ద్వారా 15మిలియన్ల క్యూబిక్ ఫీట్ల జలాలు వస్తుండగా, నాటి భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రత్యేక శ్రద్ధతో దేవాదుల ఎత్తిపోతల పథకం ఫేజ్-3లో 10.02మిలియన్ల క్యూబిక్ ఫీట్ల జలాలను పైపులైన్ల ద్వారా పంపింగ్ చేయించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. దీంతో ఫేజ్-2, ఫేజ్-3లో ఏటా నీటిని విడుదల చేయడంతో రిజర్వాయర్లు పూర్తిస్థాయిలో నిండి చేర్యాల ప్రాంతంలోని 120 చెరువుల్లోకి గోదావరి జలాలు చేరుకోగా రైతులకు ఎలాంటి నీటి కష్టాలు ఎదురుకాలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కారు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రైతులకు ఇబ్బందిగా మారింది. చేర్యాల ప్రాంతంలోని తపాస్‌పల్లి, లద్నూరు రిజర్వాయర్లకు సర్కారు నీటిని పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడంతో చెరువులు వెలవెలబోతున్నాయి. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ మేరకు అక్టోబర్‌లో ఒక్కసారి, జనవరిలో మరోసారి అధికారులు నీటిని రిజర్వాయర్లకు విడుదల చేశారు. నీరు పుష్కలంగా ఉన్న సమయంలో రెండు రిజర్వాయర్లను నింపి చెరువులకు నీటిని విడుదల చేయకుండా అధికారులు చేతులు దులుపుకొన్నారు. గతంలో ఉన్న విధానాలను ఎందుకు అవలంభించాలని అనుకున్నారో ఏమో, తిరిగి నీటిని పంపింగ్ చేయడం నిలిపివేశారు. రిజర్వాయర్లలో కొంత మేరకు నీటిని నిల్వ చేశారు. రిజర్వాయర్లలో నీరు లేకపోవడంతో ఆయా గ్రామాల్లోని చెరువులకు నీటిని పంపింగ్ చేయకపోవడంతో చెరువులు, కుంటలు ఎండిపోయి, బోరుబావుల నుంచి చుక్క నీరు రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో తమ పంటలను మూగజీవాలకు వదిలి పెడుతున్నారు.

### కాంగ్రెస్‌కు రైతులంటే చిన్నచూపు



కాంగ్రెస్ సర్కారుకు రైతులంటే మొదటి నుంచి చిన్నచూపే. రైతులకు సాగునీటిని అందించేందుకు దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా తపాస్‌పల్లి, లద్నూరు రిజర్వాయర్లకు నీటిని పంపింగ్ చేయించి పూర్తిస్థాయిలో గోదావరి జలాలు నింపాలి. అక్కడి నుంచి ప్రాధాన్యతపరంగా చెరువులకు నీటిని విడుదల చేయాలి. పంటలు బాగా పండితే ఎక్కడ వడ్లు కొనాల్సి వస్తుందో అని నీటి విడుదల నిలిపివేసింది.అందుకే రిజర్వాయర్లు నింపడం లేదు. పంటలు కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. లేకపోతే రైతులతో కలిసి పోరాటం చేస్తాం. తపాస్‌పల్లి, లద్నూరు రిజర్వాయర్లలోకి వెంటనే నీటిని విడుదల చేసి చెరువులనే నింపి పంటలు కాపాడాలి. – పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే

### అడుగంటిన భూగర్భ జలాలు

చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు బోర్లు తవ్విస్తున్నారు. ప్రతి మండలంలో నిత్యం 20 వరకు బోర్లు వేయిస్తున్నారు. ఇందులో ఒకటి రెండు మినహా మిగిలిన బోర్లలో నీరు పడటం లేదని బోరుబండ్ల నిర్వాహకులు చెబుతున్నారు. కొన్నేండ్లుగా తాము ఇలాంటి పరిస్థితి చూడలేదని, రైతుల పరిస్థితి చూస్తే తమకే బాధ కలుగుతున్నట్లు బోరుబండ్ల నిర్వాహకులు తెలిపారు. ఒక్కో రైతు దాదాపు 800 ఫీట్ల మేరకు బోరు వేసినప్పటికీ నీళ్లు రావడం లేదు. దీనికి తోడు తరచూ బోరుమోటర్లు కాలిపోతుండడంతో రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు.



గోదావరి జలాలు లేక వెలవెలబోతున్న దేవాదుల కాల్వ



ఎండిపోయిన రసులాబాద్ చెరువు

## పలువురు విద్యార్థులకు అస్వస్థత



ఇస్టా కళాశాలలో తనిఖీలు చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

పటాన్‌చెరు, ఫిబ్రవరి 22: అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడలోని ఇస్టా విద్యాసంస్థలో శనివారం పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఆహారం తిన్న తర్వాత విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తెలిసిన సివిల్ ప్రొటెక్షన్ లీగల్ సర్వీసెస్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ సలీం, మెదక్ జిల్లా అధ్యక్షుడు సందీప్‌రెడ్డి కళాశాల సందర్శించి క్యాంటీన్‌ను పరిశీలించారు. నాసిరకం అన్నం, ఎలుకలు, బొద్దింకలు, అపరిశుభ్ర పరిసరాలు, బియ్యంలో పురుగులను చూసి నిర్వాహకులను వారు నిలదీశారు. విద్యార్థుల ఆరోగ్యాలను మీ కక్కుర్తితో నాశనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న ఘటనను పెద్దదిగా చేస్తున్నారని ఇస్టా ప్రతినిధులు సీపీఎల్ఎస్ బృందంతో వాగ్వాదానికి దిగారు. దీనిపై సీపీఎల్ఎస్ బృందం సంగారెడ్డి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌కు ఫిర్యాదు చేసింది. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఇస్టా కళాశాలకు వచ్చి విద్యార్థులకు పెడుతున్న ఆహారం, బియ్యం, వంట సామగ్రిని పరిశీలించి, పరిసరాలను తనిఖీ చేశారు. తనిఖీలో ఎలుకలు, బియ్యంలో పురుగులు, నాసిరకం కస్తూరి మేథీ, ఇతర లోపాలను గుర్తించారు. క్యాంటిన్ నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీపీఎల్ఎస్ అధ్యక్షులు మాట్లాడుతూ.. ఇస్టా కళాశాల యాజమాన్యం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నదని విమర్శించారు. జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు



కీచక ఉపాధ్యాయుడు దేవయ్య

కొండపాక (కుకునూరుపల్లి), ఫిబ్రవరి 22: విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించినందుకు సిద్దిపేట జిల్లా ఖమ్మంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు కేసుగాని దేవయ్యపై పోక్సో కేసు నమోదైంది. ఉపాధ్యాయుడు కేసుగాని దేవయ్య తొమ్మిదో తరగతి విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించేవాడు. కొద్ది రోజుల క్రితం ఒక విద్యార్థినిని సైన్స్ ల్యాబ్‌లోకి పిలిపించుకొని అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయం బయట చెబితే నిన్ను పరీక్షల్లో ఫెయిల్ చేస్తానని బెదిరిస్తూ పలుసార్లు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఉపాధ్యాయుడి వేధింపులు భరించలేక విద్యార్థినులు పాఠశాల హెచ్‌ఎం, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ మమతకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని హెచ్‌ఎం డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. విషయం బయటకు రావడంతో శనివారం విద్యార్థినుల తల్లిదండ్రులు పెద్దఎత్తున పాఠశాలకు చేరుకున్నారు. కీచక ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ షీ టీమ్‌తో వచ్చి ఉపాధ్యాయుడు దేవయ్యను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. ఆ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## మురుగు కాల్వలో పేలుళ్ల కలకలం



మురుగు కాల్వలో పేలుళ్లతో పొగలు విరజిమ్ముతున్న దృశ్యం

జహీరాబాద్, ఫిబ్రవరి 22: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణం మూసానగర్ కాలనీలోని మురుగు కాల్వలో పేలుళ్ల సంఘటన కలకలం రేపింది. స్థానికుల వివరాల ప్రకారం.. శనివారం ఉదయం మూసానగర్ కాలనీలోని మురుగు కాల్వలో భారీ శబ్దంతో పటాకుల మాదిరిగా పేలుళ్ల శబ్దాలు రావడంతో కాలనీవాసులు భయాందోళనకు గురై ఇండ్ల నుంచి బయటకు పరుగులు పెట్టారు. విషయం తెలుసుకున్న జహీరాబాద్ పట్టణ పోలీసులతో పాటు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలాన్ని సందర్శించారు. పేలుళ్లకు సంబంధించి వారు విచారణ చేపడుతున్నారు.

## చిరుత సంచారంతో భయంభయం

రామాయంపేట, ఫిబ్రవరి 22 : మెదక్ జిల్లా రామాయంపేట పట్టణ శివారులో చిరుత సంచరిస్తున్నది. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వారం క్రితం ఓ లేగ దూడపై చిరుత దాడిచేసింది. అది మరువక ముందే శనివారం రామాయంపేట పట్టణ శివారులోని కేసీఆర్ కాలనీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయం వెనకాల ఉన్న కొయ్యగుట్ట వద్ద దూడపై చిరుత దాడిచేసి చంపేసింది. దీంతో కేసీఆర్ కాలనీ వాసులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో కొండ చిలువలు, పాములు సంచరిస్తున్నాయి. అటవీ ప్రాంతం దగ్గరగా ఉండడంతో చిరుత సంచరిస్తుండడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. రామాయంపేట పట్టణానికి చెందిన రైతు ఎర్రం స్వామి పశువుల కొట్టంలోని లేగదూడపై చిరుత దాడిసింది. ఈ విషయాన్ని రైతు పరిసర ప్రాంత రైతులకు సమాచారం అందించాడు.అక్కడికి చేరుకున్న కేసీఆర్ కాలనీ వాసులు, రైతులు చిరుత దాడిగా నిర్ధారించుకున్నారు. ఆ తర్వాత అటవీశాఖ అధికారులు వచ్చి విచారణ చేపట్టారు.

## పర్యావరణ పరిరక్షణ కోసం సైకిల్‌యాత్ర



పర్యావరణ పరిరక్షణపై సైకిల్‌యాత్ర చేపడుతున్న షఫీ, రూతు

*పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా జగిత్యాల జిల్లా రాయికల్‌కు చెందిన అన్నాచెల్లి షేక్ షఫీ, రూతు రాయికల్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్‌యాత్ర తలపెట్టారు. ఈనెల 18న ప్రారంభమైన వీరి సైకిల్‌యాత్ర గజ్వేల్‌కు చేరుకుంది. శనివారం గజ్వేల్ ఆర్‌అండ్ఆర్ కాలనీ మీదుగా వెళ్తున్న వీరిని 'నమస్తే తెలంగాణ' పలకరించింది. ప్రజల్లో పర్యావరణం స్పృహ పెంచడం, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి క్యాన్సర్ వంటి భయంకరమైన జబ్బుల బారిన పడకుండా జాగ్రత్తలు కల్పించేందుకు ఈ సైకిల్‌యాత్ర చేపట్టినట్లు వారు తెలిపారు. మొత్తం 1370 కిలోమీటర్లు సైకిల్‌యాత్రగా కన్యాకుమారి వరకు చేపడతామని తెలిపారు. గతంలో 2023, 2024లో రెండుసార్లు సైతం సైకిల్‌యాత్ర చేపట్టానని, ఇది మూడోసారి అని షఫీ పేర్కొన్నారు. నిత్యం ఉదయం, సాయంత్రం సమయాల్లో సైకిల్‌యాత్రను కొనసాగిస్తున్నామని, మధ్యాహ్నం విశ్రాంతి తీసుకుంటున్నామని, రాత్రి పెట్రోల్‌పంపుల వద్ద బసచేస్తున్నట్లు తెలిపారు.*

– గజ్వేల్, ఫిబ్రవరి 22

# ప్రభుత్వం విరమించుకోవాలి

- డంపింగ్‌యార్డు ఏర్పాటును వెంటనే రద్దుచేయాలి
- గుమ్మడిదలలో రైతు జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగిన ఆందోళనలు
- 12వ రోజు కొనసాగిన రిలే నిరాహార దీక్ష.. జాతీయ రహదారిపై మౌన ర్యాలీ
- నల్లవల్లిలో 18వ రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టిన మైనార్టీలు

గుమ్మడిదల, ఫిబ్రవరి 22: సంగారెడ్డి జిల్లా ప్యారానగర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటును నిరసిస్తూ ఆందోళనలు కొనసాగుతున్నాయి. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో జాతీయ రహదారిపై శనివారం మహిళా, రైతు జేఏసీ నాయకులు సంయుక్తంగా నోటికి మాస్కులు ధరించి మౌనపోరాటం చేశారు. గుమ్మడిదలలోని అంబేద్కర్ చౌరస్తాలో శనివారం 12వ రోజు రిలే నిరాహార దీక్షలో సనాథ్, రాజు ఫ్రెండ్స్ సంఘం సభ్యులు కూర్చున్నారు. నల్లవల్లిలో 18వ రోజు మైనార్టీలు రిలే నిరాహార దీక్షలో కూర్చొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గుమ్మడిదల రైతు జేఏసీ కమిటీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మద్దుల బాల్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు ఏర్పాటు తమ ప్రాంతానికి అన్నివిధాలుగా నష్టాన్ని చేకూరుస్తుందని తెలిపారు. 18 రోజులుగా ఆందోళనలు చేస్తుంటే ప్రభుత్వం కనీసం స్పందించక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కారు డంపింగ్ యార్డు ఏర్పాటు విరమించుకోకపోతే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.



గుమ్మడిదలలో జాతీయ రహదారిపై 'మౌనదీక్ష' చేస్తున్న రైతులు, మహిళలు



గుమ్మడిదలలో జాతీయ రహదారిపై మాస్కులు ధరించి మౌన ర్యాలీలో పాల్గొన్న మహిళలు, రైతులు, జేఏసీ నాయకులు

# దుబ్బతండాకు దారేది

- రోడ్డు లేక గిరిజనుల అవస్థలు
- తారురోడ్డు వేయాలని వేడుకోలు
- 108 అంబులెన్స్ రాక అత్యవసర సమయాల్లో పోతున్న ప్రాణాలు
- మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టించుకోవాలని గిరిజనుల విజ్ఞప్తి

అక్కన్నపేట, ఫిబ్రవరి 22: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని మల్‌చెర్వుతండా గ్రామ పంచాయతీ పరిధిలోని దుబ్బ తండాకు వెళ్లేందుకు మట్టిరోడ్డు కూడా సరిగ్గా లేదు. దీంతో రాకపోకలు సాగించేందుకు గిరిజనులు అవస్థలు పడుతున్నారు. తండాకు తారు రోడ్డు వేయాలని ఇటీవల ఆ తండావాసులు నిరసన వ్యక్తం చేశారు. తండాలో మురుగు కాల్వలు లేక ఇండ్ల ముందు నుంచే మురుగు పారుతున్నది. ఎక్కడిక్కడ పారిశుధ్యం పేరుకుపోగా ఇబ్బందులకు గురవుతున్నారు. తండాలో ఎవరి ఇంట్లోనైనా శుభకార్యం జరిగితే వారు ట్రాక్టర్ల ద్వారా తాత్కాలికంగా మట్టి వేసుకొని చదును చేసుకుంటున్నారు. రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తండాలో ఎవరికైనా పాముకాటు వేసినా, ఇతర అత్యవసర సమయాల్లో 108కు ఫోన్ చేస్తే తండాకు అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేదు. హుస్నాబాద్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అత్యధిక గిరిజన తండాలు ఉన్న అక్కన్నపేట మండలంపై దృష్టి సారించి, తమ తండాలో ప్రధానంగా రోడ్లు, మురుగు కాల్వలు, తాగునీటి ట్యాంకులు, వీధి దీపాలు, ఇతరత్రా మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని దుబ్బ తండా గిరిజనులు కోరుతున్నారు.



దుబ్బతండాకు వెళ్లే మట్టి రోడ్డు

### తండాకు అంబులెన్స్ వస్తే బతికేటోడు..



ఇటీవల తండాకు చెందిన భానోతు బాలునాయక్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు, తండావాసులం 108కు ఫోన్ చేశాం. మల్‌చెర్వుతండా వరకు వచ్చిన అంబులెన్స్ రోడ్డు సరిగా లేదని దుబ్బతండాకు రాలేదు. గంట వరకు వేచి ఉండి, చివరికి బైక్‌పై తీసుకెళ్లి మల్‌చెర్వుతండాలో ఉన్న అంబులెన్స్ ఎక్కించాం. దవాఖానకు వెళ్లిన తరువాత బాలునాయక్ చనిపోయాడు. అదే అంబులెన్స్ తండాకు వచ్చి ఉండేలా రోడ్డు ఉంటే ఇయ్యాల బాలునాయక్ బతికి ఉండేవాడు. కనీసం తండాలో ఫోన్ సిగ్నల్ కూడా సరిగ్గా రాదు. –గుగులోతు మహేందర్, దుబ్బతండా వాసి

### రోడ్డు వస్తదో లేదో...



దుబ్బతండాకు డాంబర్ రోడ్డు సచ్చిపోయే వరకు అయినా వస్తదో లేదో. రెండేండ్ల కింద రోడ్డు వేస్తామని వచ్చి చూసిపోయింద్రు. అంతలా ఎలక్షన్లు వచ్చినై. ఇగ రోడ్డు లేదు ఏం లేదు. వాన పడితే మా తండా నుంచి మల్‌చెర్వుతండాకు పోవడం నరకంగా ఉంటది. బురద, జారుడు, నడిచిపోవడానికీ తిప్పలే. తండాల ఫంక్షన్లు చేసుకుంటే వచ్చిన సుట్టపోళ్లు రోడ్డు లేకపాయె అని ఇజ్జత్ తీస్తున్నరు. ఇప్పుడు ఉన్న గీ మంత్రి పొన్నం ప్రభాకర్ మా దుబ్బతండా దిక్కు చూసి రోడ్డు వేయాలని మా తండోళ్ల అందరి తరపున మొక్కుతున్న. – బానోతు చిలుకమ్మ, దుబ్బతండా